శనివారం 23 ఆగస్టు 2025 5 అనంతపురం







ఖజానా ఖాళీ..!

పంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తున్నామంటూ పాలకులు చెప్పే మాటలు నీటిమూటలుగానే ఉన్నాయి. పైసా లేక అత్యధిక పంచాయతీ ఖజానాలు ఖాళీ అయ్యాయి. డబ్బుల్లేకపోవడంతో పంచాయతీల నిర్వహణకు అటు పాలకవర్గం, ఇటు అధికారులు తలలుపట్టుకుంటున్నారు. ఇంటి, నీటి పన్నులు, లైసెన్సుల సొమ్ముతో ఏదో రకంగా కొంతమేర నెట్టుకొస్తున్నారు. ఇవి కూడా మేజర్ పంచాయతీల్లో వసూలు అవుతుండగా, మైనర్ పంచాయతీల్లో అంతంతమాత్రంగానే ఉంది. దీనికితోడు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక పది నెలలైంది. ఒకవైపు పన్నులు, ఫీజులు వసూలుకాక మరోవైపు ప్రత్యేక గ్రాంట్లు రాక పంచాయతీల ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైంది.



- పంచాయతీలకు నిధుల సమస్య
- జాడలేని 15వ ఆర్థిక సంఘం నిధులు
- పారిశుధ్య నిర్వహణకూ ఆపసోపాలు
- ఆదుకోవాలని సర్పంచుల వేడుకోలు

ప్రజాశక్తి-పెనుకొండ

నిధుల లేమి వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పనులు అటకెక్కాయి. ప్రత్యేక నిధులు వస్తే తప్ప అభివృద్ధి పనులు చేయటానికి వీలుపడని పరిస్థితి నెలకొంది. రోజు వారీ నిర్వహణకు సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్ల మరమ్మతులకు కావాల్సిన విడిపరికరాలు, కొత్త వీధి దీపాలను అప్పుపై తీసుకొస్తున్నారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉండటంతో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. బ్లీచింగ్ పౌడర్, సున్నం కొనేందుకూ కూడా డబ్బుల్లేని దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటీవల వర్షాలు బాగా కురవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. వీటి నివారణకు ఫాగింగ్ కూడా చేయ లేకపోతున్నారు. నిధులలేమితో పంచాయతీ కార్యదర్శులు సతమతం అవుతున్నారు.

జాడలేని 15వ ఆర్థిక సంఘం నిధులు

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక పది నెలలైంది. ఈనిధులు వచ్చి ఉంటే పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండేది. ఈ నిధుల్లో 50 శాతం తప్పనిసరిగా తాగునీరు, పారిశుధ్యం నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంది. వర్షాకాలంలో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టడానికి వీలుపడేదని కార్యదర్శులు చెబుతున్నారు. ఆర్థికంగా పలుకుబడి కలిగిన కొందరు సర్పంచులు మాత్రం ప్రజలు ఇబ్బందులు పడకుండా సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నారు.

పంచాయతీల్లో పరిస్థితి దుర్భరం

అత్యధిక పంచాయతీల్లో పన్నుల వసూళ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక నిధులు విడుదలైతేనే ఆయా పంచాయతీల్లో అభివృద్ధి, పారిశుధ్య ఇతర పనుల నిర్వహణకు అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం పది నెలల క్రితం నిధులు మంజూరు చేసింది. తర్వాత పంచాయతీల నిర్వహణకు నిధులు మంజూరు చేయలేదు. వీధి దీపాలను మార్చడానికి ఖజానాల్లో చిల్లి గవ్వలేకపోవడంతో చాలా గ్రామాల్లో వీధులు అంధకారంలోనే దర్శనమిస్తున్నాయి.

కార్మికుల జీతాలకు కరువే..

పంచాయతీల్లో తగినంత నిధులు లేకపోవడంతో పారిశుధ్య కార్మికుల జీతాలు, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ సిబ్బంది, క్లాప్ మిత్ర, షెడ్‌మిత్రలకు సకాలంలో జీతాలు అందట్లేదు. రెండు మూడు నెలలకోసారి ఇస్తున్నారు. పంచాయతీల్లో కాంట్రాక్టు కార్మికులు, సిబ్బంది జీతాలు దాదాపు ఆరు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారింది. అధిక వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గుట్టూరు పంచాయతీలో క్లాప్ మిత్రలకు ఆరు నెలలుగా జీతాలు లేవు. దీంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయ్యింది. దాదాపు అన్ని పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది.

నిధులిచ్చి ఆదుకోండి : సర్పంచులు

ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేసి ఆదుకోవాలని పలువురు సర్పంచులు వేడుకుంటున్నారు. పంచాయతీల్లో కనీసం ఒక వీధిలైటు పోతే మార్చడానికి కూడా నిధులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న సర్పంచులు తమ జేబుల్లో నుంచి ఖర్చు చేసి పంచాయతీల నిర్వహణ చేపడుతున్నారని వాపోతున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిషేధిత 22ఏ, డాటెడ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం సాయంత్రం జిల్లా స్థాయి 22ఏ కమిటీ, డిఎల్‌సి, డిఎల్‌ఎన్‌సి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్‌ని, 22ఏ భూములను తొలగించేందుకు, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో 22ఏకు సంబంధించి 32 క్లెయిమ్స్ ని విచారించడం జరగగా, అందులో 25 ఆమోదించగా, 3 తిరస్కరించగా, 4 దరఖాస్తులను పున్హ పరిశీలించాలన్నారు. డాటెడ్ ల్యాండ్స్ కు సంబంధించి 26 క్లెయిమ్స్‌ని విచారించగా అందులో 14కు ఆమోదం, 6 తిరస్కరణకు, 6 పున్హ పరిశీలనకు ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ ఎ.మాలోల, ఆర్డీవోలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

నైపుణ్య కార్యక్రమలు మరిన్ని నిర్వహించాలి

జిల్లాలో నైపుణ్య కార్యక్రమలు మరిన్ని నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో అనంతపురం జిల్లా అన్ని జిల్లాల కంటే మెరుగ్గా నిర్వహించి రాష్ట్రంలో ప్రథమ స్థానం పొంది బహుమతి గెలుచుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో స్కిల్ డెవలప్మెంట్ కార్యాలయంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి తదితరులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నైపుణ్య కార్యక్రమాలను నిర్వహించి మరింత మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు.

యూరియా కొరతపై కదలిక

పరిశీలనకు ప్రత్యేక బృందాలు

ప్రజాశక్తి-అనంతపురం

యూరియా కొరతపై ఆందోళనలు నెలకొంటున్న తరుణంలో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలనకు సిద్ధమైంది. సమస్య ఎక్కడుందని గుర్తించి యూరియా కొరతలేకుండా చూసేందుకు వీలుగా పరిశీలనలు, తనిఖీలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు పరిశీలన కోసం ప్రత్యేకంగా మూడు బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యయసాయాధికారి ఉమామహేశ్వరమ్మ నేతృత్వంలో సొసైటీలు, డిసిఎంఎస్‌ల నిర్వహణపై దృష్టి సారించనున్నారు. ప్రయివేటు డీలర్ల వద్దనున్న యూరియా అమ్మకాల పరిశీలనకు ఎపి మార్క్‌ఫెడ్ మేనేజరు పెన్నాశ్వరీ, ఎఒ వెంకటకుమార్‌ను బాధ్యులుగా ఏర్పాటు చేశారు. మరో బృందానికి డిసిఒ అరుణకుమారిని నేతృత్వంలో మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందాలు అమ్మకాలు సాగిస్తున్న ఏజెన్సీల నిర్వహణలపై క్షేత్రస్థాయిలో పరిశీలనలను జరిపి నివేదికలను అందజేయాల్సి ఉంటుంది. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన యూరియా అమ్మకాలను ఈ బృందాలు పరిశీలించి నివేదికను అందజేయాల్సి ఉంటుంది. మరోవైపు విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ శాఖ కూడా యూరియా అమ్మకాలపై దృష్టి సారించింది. ఎక్కడైనా పక్కదోవ పట్టినట్టు తేలితే చర్యలు ఆ శాఖ సిఫార్సు చేయనుంది. ఈ మేరకు శుక్రవారం నాడు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఎడిఎ అల్తాఫ్ అలీలు డిసిఎంఎస్‌ను పరిశీలించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అత్యవసరం - ప్రజాభిప్రాయ సేకరణలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల బాగోగులే తన ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్పష్టం చేశారు. రూ. 182 కోట్లతో మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని కౌన్సిల్ సమావేశంలో శుక్రవారం కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాల్టీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అత్యవసరం అన్నారు. 20ఏళ్ల వరకూ మున్సిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి జరగాలి, మౌలిక సదుపాయాలు, ఇతరత్రా వ్యాపారాలు, ఆర్థిక వనరులు సమకూర్చడం లాంటి వాటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తామన్నారు. దీనిపై ప్రజాభిప్రాయం మేరకు మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. 2047 నాటికి మాస్టర్ ప్లాన్ పూర్తి స్థాయిలో అమలైతే ఆ నాటికి మున్సిపాలిటీ జనాభా 80వేలకు పైగానే చేరుకోవచ్చన్నారు. వీటి నేపథ్యంలో రోడ్ల వెడల్పు, కొత్తరోడ్ల ఏర్పాటు, లింక్ రోడ్లు, అభివృద్ధితో పాటు ఇతర కమర్షియల్ విషయంలో అభివృద్ధిని తీసుకురావడమే ప్రధాన లక్ష్యమ న్నారు. వ్యాపార వర్గాలు, భవన యజమానుల సహకారంతో పట్టణంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఏ గ్రామం వెళ్లినా రోడ్లు సరిగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



రాప్తాడు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు



గుంతకల్లులో పింఛన్ల తొలగింపుపై అధికారులను నిలదీస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు

పింఛన్ల తొలగింపు దుర్మార్గం

- వికలాంగులందరికీ పింఛన్ ఇవ్వాలి
- సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-రాప్తాడు

సంక్షేమ పాలనంటూ మాటలు చెప్పే కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్లను తొలగించడం అత్యంత దుర్మార్గమైన చర్యని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల పేరుతో ఇటీవల వికలాంగులకు ఇచ్చిన అనర్హత పింఛన్ల నోటీసులను వెనక్కు తీసుకుని యథావిధిగా ఈ నెల పింఛన్ సొమ్ము ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వికలాంగులకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో రాప్తాడు ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎంపీడీవో బుల్లె విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, సిపిఎం రాప్తాడు రూరల్ ప్రాంతీయ కమిటీ సభ్యుడు టి.రామాంజనేయులు మాట్లాడుతూ పింఛన్లు తీసుకునేందుకు అన్ని అర్హతలున్నా అధికారులు అనర్హత నోటీసులు ఇచ్చారన్నారు. నోటీసులు ఇచ్చిన వారిలో కనీసం నడవలేకుండా మంచానికే పరిమితం అయిన వారు కూడా ఉన్నారన్నారు. వీరిని ఎవరూ చూసినా వికలాంగులుగా గుర్తిస్తారని చెప్పారు. అలాంటిది వైద్యాధికారులు వారు వికలాంగులు కాదని ఎలా నిర్ధారణ చేస్తారని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా ఇలా వికలాంగులకు అన్యాయం చేయడం దుర్మార్గం అన్నారు. ఒక్క రాప్తాడు మండలంలోనే దాదాపు 600 మంది పింఛన్లను తొలగించారన్నారు. చెర్లోపల్లి గ్రామానికి చెందిన హర్షిత అనే అమ్మాయి పుట్టుకతోనే కాళ్లు, చేతులు పనిచేయక మంచానికే పరిమితం అయ్యిందన్నారు. ఈ బాలిక కూడా పింఛన్‌కు అనర్హురాలంటూ నోటీసు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇలాంటి బాధితులు మండలంలో చాలా మంది ఉన్నారన్నారు. వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, మండల ప్రాంతీయ కమిటీ సభ్యుడు పోతలయ్య, సత్యసాయి జిల్లా కార్యదర్శి సుబ్బిరెడ్డి, హమాలీలు, లక్ష్మన్న, మధు, నాగేంద్ర, వికలాంగులు పాల్గొన్నారు.

గుంతకల్లులో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా.. రాస్తారోకో..

గుంతకల్లు : పట్టణంలో తొలగించిన, సవరించిన దివ్యాంగుల పింఛన్లను తిరిగి పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పింఛన్ల తొలగింపును వ్యతిరేకిస్తూ సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో దివ్యాంగులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పింఛన్లను లక్షకుపైగా తొలగిస్తూ నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. దీంతో వేలమంది వికలాంగుల కుటుంబాల్లో బతుకు భారమై కొంతమంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారన్నారు. పింఛన్లు ఇవ్వాలని తిండితిప్పలు లేక వారం రోజుల నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తొలగించిన వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వికలాంగులతో కలిసి నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కాగా ఈ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో సీఐ మస్తాన్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సమీక్షించారు. తర్వాత అసిస్టెంట్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి వచ్చి ఆందోళనకారుల నుంచి వినతి పత్రం తీసుకుని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సురేంద్రబాబు, కమిటీ సభ్యులు ఉలిగప్ప, షాషా, జాకీర్, అబ్దుల్లా, జ్యోతి, లక్ష్మీబాయి, తిమ్మప్ప, రాము, ఖాదర్, ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు షకీరా, సుగుణ, సరస్వతి, వికలాంగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రధానచార్యులు తిరుమలరావు

'జెవివి వేళ'లో సరస్వతీ విద్యామందిరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఈ నెల 20, 21 తేదీల్లో ప్రొద్దుటూరులోని సరస్వతీ విద్యామందిరంలో నిర్వహించిన రాయలసీమ జోనల్ స్థాయి జనవిజ్ఞాన వేదిక వేళలో స్థానిక సరస్వతీ విద్యామందిరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన క్రియేష, రాకేష్‌శర్మ, సాయిధర్మతేజ, వైష్ణవి లను ప్రధానచార్యులు కరణం తిరుమలరావు, సైన్స్ ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ నియామకం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి ఆదేశాలతో సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటనరసింహులు సూచనల మేరకు నూతన కమిటీని నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా ఈశ్వర్‌ప్రసాద్, రూరల్ మండల అధ్యక్షుడిగా దురదకుంట తిమ్మరాజులు, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల అధ్యక్షులుగా మధుసూదన్, మర్రిస్వామి, గోవిందప్ప, గొల్ల కృష్ణమూర్తిలను నియమించారు. .

బ్రహ్మసముద్రం మండల కన్వీనర్‌గా కృష్ణమూర్తి



కృష్ణమూర్తి

బ్రహ్మసముద్రం : కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌గా ఎర్రకొండాపురం గొల్ల కృష్ణమూర్తిని నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరంనేటి రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, రాహుల్, షర్మిలారెడ్డి చేస్తున్న పోరాటాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మండల నూతన కన్వీనర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం మండలంలోని నాయకులు, కార్యకర్తలతో కలిసి పని చేస్తామన్నారు. తన సేవలను గుర్తించి ఈ అవకాశం కల్పించిన వైఎస్ షర్మిలారెడ్డి, ఎన్.రఘువీరారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణం, మండల పరిధిలో వినాయక ఉత్సవాలు నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి పొందాలని సిఐ జయనాయక్ తెలిపారు. ఈ అంశంపై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. నిర్వాహకులకు తగిన సూచనలు, జాగ్రత్తలు తెలిపారు.

కుంటలు, బావుల్లో చేపలు విడుదల

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో దోమల నివారణలో భాగంగా శుక్రవారం ప్రజారోగ్య, మత్స్య పరిశ్రమ శాఖ అధికారులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, ఆరోగ్య విద్యా బోధకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కుంటలు, బావుల్లో గంబుషియా చేపలు వదిలారు. ఇందులో భాగంగా నర్సోజీ కుంట, వట్లకుంట, సీతమ్మ కుంట, దుగ్గిలమ్మ బావి, తదితర ప్రాంతాల్లో గంబూజియా చేపలు వదిలారు. ఈ చేపలు నిల్వ ఉన్న నీటిలో పెరిగే దోమల లార్వాను ఆహారంగా తీసుకోవడం వల్ల దోమల ఉత్పత్తిని నివారించవచ్చని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యేకు సిఐటియు విన్నపం



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్మికులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చారు. నాగరాజు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పక్కా ఇల్లు నిర్మించాలన్నారు. పని భారంతో అనారోగ్యం బారిన పడుతున్నారని, ఇప్పటికే కొందరు కార్మికులు చనిపోయారని వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈపిఎఫ్, ఈఎస్ఐకి సంబంధించిన ఇప్పటి కార్మికుల కార్డులు ఇవ్వలేదన్నారు. దీంతో మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. మున్సిపాలిటీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ విభజించు, పాలించు పద్ధతిలో వ్యవహరిస్తూ, కార్మికుల పట్ల దుర్భాషలాడుతున్నారని ఫిర్యాదు చేశారు. వేతనాలు కట్ చేస్తూ వేధిస్తున్నారని, స్వాతంత్ర్య దినోత్సవంకు కూడా పిలువకపోవడం అన్యాయమన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌అలిఖాన్ మహిళలను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్‌ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దుర్గమ్మ, వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు తిమ్మప్ప, తదితరులు ఉన్నారు.

'పింఛను' బాధితుల కోసం 'జిపిఆర్' హెల్ప్‌లైన్

రాయదుర్గం : కూటమి ప్రభుత్వం అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గమని, బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి శుక్రవారం ఓ వీడియో విడుదల చేశారు. అర్హులైన పింఛనుదారులు తమ జిపిఆర్ హెల్ప్ లైన్-73865 66233 సమాచారం ఇస్తే వారి తరపున పోరాడి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రెండు, మూడు దశాబ్దాలుగా పింఛను పొందుతున్న అర్హులైన వికలాంగులు, వృద్ధుల పింఛన్లను కూట మి ప్రభుత్వం కుంటి సాకులు చూపి తొలగించడం, అర్హులు కాదని నోటీసులు పంపడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న వికలాంగుల పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరిటీ అన్యాయం జరగకుండా అండగా ఉంటానని గౌని ప్రతాప్ రెడ్డి భరోసా ఇచ్చారు.

ఎరువుల నిల్వలపై మెరుపుదాడులు

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

వ్యవసాయ, కో ఆపరేటివ్, రెవెన్యూ అధికారులు ఆలోచించి.. ధ్రువీకరించుకుని జిల్లాలోని ఎరువుల నిల్వలపై మెరుపు దాడులు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం అమరావతి నుంచి ఖరీఫ్-2025లో ఎరువుల లభ్యతపై వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలిసి రాష్ట్రంలోని కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయిలో అగ్రికల్చర్, కోపరేటివ్, మార్క్‌ఫెడ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. హెచ్‌ఎల్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌ని ఇందుకు హెడ్ గా నియమించి రోజూ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలన్నారు. ఎరువుల నిల్వలపై జాయింట్ టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడులు చేయాలన్నారు. మండల స్థాయిలో పేపర్ ఆర్టికల్స్ ని జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించి రీజాయిండర్స్ ఇవ్వాలన్నారు. ఎరువుల రిటైలర్స్, హోల్సేలర్లతో జిల్లా వ్యవసాయ అధికారి సమావేశం నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిసిఒ అరుణకుమారి, మార్క్‌ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, వ్యవసాయ అధికారి బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రాప్తాడు



మలేరియా నివారణ మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

మలేరియా నివారణకు వైద్య సిబ్బంది చేసే స్ప్రేయింగ్‌కు ప్రజలు సహకరించాలని మలేరియా నివారణ అధికారి ఓబులు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని రామినేపల్లి, హంపాపురం గ్రామాల్లో అనంతపురం మలేరియా సబ్‌యూనిట్ అధికారి మద్దయ్య పర్యవేక్షణలో మిలాథియాన్ డబ్ల్యూడిపి 25శాతం మందును ఇంటింటా పిచికారీ చేశారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నియంత్రణకు తమతో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ మందును ఇంటిలోని గోడలపై పిచికారీ చేయడం వల్ల దోమలు గోడలపై వాలినప్పుడు చనిపోతాయన్నారు. అలాగే ప్రతిఒక్కరూ రాత్రి నిద్రించే సమయంలో దోమతెరలు కట్టుకోవాలన్నారు. అదేవిధంగా ఇళ్ల, పరిసర ప్రాంతాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి అబ్దుల్‌మునాఫ్, సూపర్‌వైజర్ నూర్‌బాషా, రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకుడు నరసింహా, సామాజిక ఆరోగ్య అధికారిణి చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్లు నారాయణస్వామి, గోపాల్, ఆరోగ్య కార్యదర్శి పుష్పావతి, ఆశా కార్యకర్తలు శ్రావణి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



శాంతి కోసం ర్యాలీ నిర్వహిస్తున్న మానవతా సభ్యులు

మానవత సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శుక్రవారం అనంతపురంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెన్నార్ భవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ క్లాక్‌టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకూ.. అక్కడి నుంచి పెన్నార్ భవన్ వరకూ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని ఎస్‌వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు మానవత సేవా సంస్థ ముద్రించిన ప్రత్యేక నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ ర్యాలీలో మానవత సంస్థ ఛైర్మన్ శీలా జయరామప్ప, కో ఛైర్మన్ వి.నరసింహారెడ్డి, కన్వీనర్ గంగిరెడ్డి, కార్యదర్శి ప్రకాష్‌బాబు, కోశాధికారి నాగరాజశ్రేష్ఠి, సంయుక్త కార్యదర్శి రామమూర్తి, డైరెక్టర్లు పెద్దనగౌడ్, ప్రభాకర్, గోవిందరాజులు, వరదరాజులు, చెన్నారెడ్డి, నారాయణస్వామి, సభ్యులు అనంతయ్య, తిప్పేస్వామి, దేవేంద్రప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి-శింగనమల

వరిసాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమనిఅనంతపురం రైతు శిక్షణ సెంటర్ వ్యవసాయ అధికారి నరసింహులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాచేపల్లి గ్రామంలో అగ్రికల్చర్ టెక్నికల్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ కింద వరి సాగు, మెలకువలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సలహాలు, సూచనలు అందించారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద రాచేపల్లికి బిపిటి 2846 రకం వడ్లు ఫౌండేషన్ సీడ్ సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ రకం పంట అగ్గితెగులు, సుడి దోమను తట్టుకుంటుందన్నారు. పంట కాలం 145 రోజులు అన్నారు. అయితే వరి పొలంలో తూర్పు, పడమర దిశ లో ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అశ్విన్ కుమార్, రాచేపల్లి రైతు సేవ కేంద్రం విహెచ్ఎ రమేష్, రైతులు పాల్గొన్నారు.

గ్రీన్ కవరేజ్‌పై సమీక్ష

అనంతపురం కార్పొరేషన్ : గ్రీన్ కవరేజ్‌పై అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రాహర్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక కౌన్సిల్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కమిషనర్ బాలస్వామితో కలిసి నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల వారీగా అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించిన మొక్కలు నాటేందుకు అవకాశాలను చర్చించారు. వార్డు అమినిటీ సెక్రటరీస్ ద్వారా సర్వే చేసి, అందుకు అనుగుణంగా మొక్కలు నాటాలని అసిస్టెంట్ కలెక్టర్ సూచించారు. వార్డు అమినిటీ సెక్రటరీస్ పరిధిలో జిపిఎస్ కో ఆర్డినేట్స్ ద్వారా సర్వే చేసి సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని ఇంజనీర్లకు సూచించారు.

నేడు పుట్లూరుకు కలెక్టర్

పుట్లూరు : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం పుట్లూరుకు రానున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రకటనలో తెలిపారు. కావున మండల అధికారులు ఉదయం 8 గంటలకు మండల కేంద్రంలోని సచివాలయానికి హాజరు కావాలని కోరారు.

బి.యాలేరు-తగరకుంట రోడ్డు పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు : అనంతపురం-తగరకుంట మార్గంలో చేపట్టిన రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మూడు నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేయిస్తామన్నారు. తనకు తాను తోపుగా చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సుమారు 25 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 2021లో పనులు ప్రారంభించి కాంట్రాక్టర్లు కప్పం కట్టకపోవడంతో పనులను నిలిపివేశారని ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి పనులను ముమ్మరం చేసినట్లు తెలిఆపరు. మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

అధిక ధరకు యూరియా విక్రయిస్తే చర్యలు

బుక్కరాయసముద్రం : యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఉద్యాన శాఖ అధికారిని ఉమాదేవి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి, దయ్యాలకుంటపల్లి గ్రామాల్లో ఉన్న ఐదు ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టాకు రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియాను ఎంఆర్‌పి ధర రూ.266.50కే విక్రయించాలన్నారు. అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఉమాదేవి

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం కార్పొరేషన్ : అహుడా పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకోవాలని అహుడా వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ కోరారు. శుక్రవారం జూమ్ మీటింగ్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన డీఎల్పోలు, పంచాయతీ సెక్రటరీలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జూలై 27న 134 జీవో జారీ చేసిందన్నారు. అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు మూడునెలల గడువులోగా ఎల్‌ఆర్‌ఎస్‌కు వెంచర్ యజమానులు ప్లాట్ల యజమానులు విడివిడిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనధికార లే అవుట్లలో ప్లాట్ల కొనుగోలు చేసిన వారు భవన నిర్మాణ అనుమతులు పొందటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం భవన నిర్మాణాలకు వీలుగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్ అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, జెపిఒ హరీష్‌చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లను పునరుద్ధరించకుంటే కలెక్టరేట్ దిగ్బంధం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించకుంటే వికలాంగుల కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అల్టిమేటం జారీ చేశారు. శుక్రవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. గత ఎన్నికల సమయంలో కూటమి పార్టీల నాయకులు సంక్షేమాన్ని ఎక్కువగా అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే నాలుగు నెలలు మాత్రమే పింఛన్లు సక్రమంగా పంపిణీ చేశారన్నారు. ఆ తర్వాత పింఛన్లలో కోతలు ప్రారంభించారని తెలిపారు. గడిచిన 14 నెలల వ్యవధిలోనే ఏకంగా 4.15 లక్షల మంది పింఛన్లకు కోత పెట్టారని మండిపడ్డారు. ఏళ్ల తరబడి పింఛన్లు పొందుతున్న వారిని కూడా అనర్హులుగా చెప్పడం ఏంటని ప్రశ్నించారు. తాజాగా 9601 దివ్యాంగుల పింఛన్లు తొలగించారని తెలిపారు. వీటికి తోడు వైకల్యశాతం తగ్గించేందుకు 2314 మంది పింఛన్‌దారులకు కూడా నోటీసులు ఇచ్చారన్నారు. ఒక్క అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోనే 1008 మంది దివ్యాంగులకు నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఇది చాలా దారుణమని, ప్రభుత్వం దివ్యాంగుల పట్ల మానవత్వంతో వ్యవహరించడం లేదన్నారు. దివ్యాంగులు మాట్లాడలేరు.. కదల్లేరు.. పోరాడలేరు అని అనుకుంటున్నారేమో.. వాళ్ల తరపున వైసిపి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తప్పులు సరిదిద్దుకుని దివ్యాంగులకు పింఛన్ పునరుద్ధరించి సెప్టెంబర్ 1వ తేదీన పంపిణీ చేయకపోతే కలెక్టరేట్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

జూనియర్ ఎన్టీఆర్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి వ్యాఖ్యలు దుర్మార్గం

సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఎన్టీఆర్ తల్లిపై అసభ్యంగా మాట్లాడిన ఎమ్మెల్యేను చంద్రబాబు మందలించినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సాక్షాత్తూ నందమూరి హరికృష్ణ సతీమణిని అవమానిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టీడీపీ ఎమ్మెల్యేల అరాచకాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు బరితెగించి మహిళలపై కూడా అనుచితంగా మాట్లాడటం, వ్యవహరించడం చూస్తున్నామన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు వారిని ప్రోత్సహిస్తూ, పైకి మాత్రం వారిపై ఆగ్రహంతో ఉన్నట్లుగా నటిస్తున్నారు. మీ పార్టీలోనే ఎమ్మెల్యేలుగా ఉన్న వారు, మీ కుటుంబంలోని మహిళ పట్ల ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఎందుకు కఠినంగా స్పందించడం లేదో చంద్రబాబే చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రారంభ దశలో క్యాన్సర్ నివారణ సాధ్యం

డిఎంహెచ్‌ఒ ఇబి దేవి



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి సూచించారు. శుక్రవారం జిల్లాలోని అనంతపురం మెడికల్ కళాశాల, సామాజిక ఆరోగ్య కేంద్రం, కళ్యాణదుర్గం, గుంతకల్లులో వైద్యాధికారులకు క్యాన్సర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇబి దేవి మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్‌పై పూర్తి అవగాహన వచ్చేలా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ద్వారా స్పెషలిస్ట్ డాక్టరతో అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మెడికల్ కళాశాలలో పిపిటి ద్వారా ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ గీత, సత్యసాయి నోడల్ ఆఫీసర్ యశోదలక్ష్మి, పిజి స్టూడెంట్స్ కస్తూరి, జయగౌరీ, ఇన్ సర్వీస్ పిజి స్టూడెంట్ డాక్టర్ రాజేంద్ర, డిస్టిక్ టిబిటి డాక్టర్లు పరమేష్, ప్రవీణ్, రఘునందన్, ఇందిరా ప్రియదర్శిని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్‌సోనియా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్, సెకండరీ హెల్త్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ డేవిడ్, ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎస్‌పిఎం విభాగం డిఇఎంఒ త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, ఎన్‌సిడి సిబ్బంది ప్రేమ్, శ్రీరామ్, కిషోర్, మౌనిక, శశికళ, సిహెచ్‌ఒ సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

02 ఖాతా నుంచి ఇతర చెల్లింపులు సరికాదు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్



కమిషనర్‌తో వాగ్వివాదం చేస్తున్న కాంట్రాక్టర్లు

మున్సిపల్ కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు సంబంధించి జనరల్ ఫండ్స్‌కు సంబంధించిన 02 ఖాతా నుంచి డీజిల్ వేతనాల చెల్లింపు సరికాదని పలువురు కాంట్రాక్టర్లు వాపోయారు. ఏడాదిన్నర కాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం కొంతసేపు కమిషనర్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తర్వాత కౌన్సిల్ హాల్లో నక్ష ప్రోగ్రాంలో ఉన్న కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు.నీ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ మున్సిపల్ నిధులు జమ అయ్యే 8448001020101001001 వివిఎన్ ఖాతా నుంచి ప్రతినెలా దాదాపు రూ.70లక్షలు ఇతర ఖాతాలకు మళ్లిస్తున్నారన్నారు. ఈ నిధులను డీజిల్ బిల్లులు, జీతాలు మరియు ఇతర ఖర్చుల కోసం వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధమైన నిధుల మళ్లింపుల వల్ల కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు తీవ్రంగా ఆలస్యం అవుతున్నాయన్నారు. దీంతో కాంట్రాక్టర్లు తీవ్రమైన ఆర్థిక సమస్యలు, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున నిధుల దుర్వినియోగం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ డీజిల్ బిల్లుల చెల్లింపు చేయవద్దని ఎదురు ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల సమస్యలను దృష్టిలో ఉంచుకుని తదుపరి చర్యలు చేపడతామన్నారు. చేసేది లేక కాంట్రాక్టర్లు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుత్తి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, నవీన్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం త్వరలో చేపట్టనున్న ఛలో కలెక్టరేట్‌కు సంబంధించి గోడపత్రికలను గుత్తిలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేయాలని, జీవో నెం.77 రద్దు చేసి, పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలని కోరారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెస్‌బిల్లులు నెలకు రూ.3వేలకు పెంచాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేసి హాస్టళ్ల అభివృద్ధికి నిధులు కేటాయించి సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్న జీవో నెం.42, 35ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలనీ, ఖాళీ విసి పోస్టులు భర్తీ చేయాలన్నారు. అర్హులకు తల్లికివందనం రూ.15 వేలు ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలన్నారు. విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, థామస్, ఉమేష్‌యాదవ్, ముజామిల్, జయరాజ్, మధు, జిలాన్‌బాషా, కన్నయ్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ తాజా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం




ఎంఆర్ తాజా మార్ట్, (ఇన్‌సెట్‌లో) నిర్వాహకులు మధుమోహన్‌రెడ్డి

నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో జొన్నా ఐరన్‌మార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఆర్ తాజా మార్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు, కిరాణా సరుకులు ఒకేచోట అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎంఆర్ తాజా మార్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. తమ వద్ద కాయగూరలు, కిరాణా సరుకులు హోల్‌సేల్ ధరలకు లభిస్తామయన్నారు. ముఖ్యంగా కాయగూరలను పొలాల నుంచి నేరుగా మార్టుకు తీసుకురానున్నట్లు వివరించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, క్యాటరింగ్‌లకు ప్రత్యేకంగా తగ్గింపు ధరలతో అందిస్తున్నట్లు చెప్పారు. తమ కస్టమర్లకు వాట్సప్ ద్వారా రోజూ ధరలను తెలియజేస్తామన్నారు. అంతేగాకుండా ఉచితంగా డోర్ డెలివరీ సౌకర్యం కూడా ఉందన్నారు. ఈ అవకాశాన్ని అనంతపురం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిఇఒకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ డిఇఒగా అవార్డు అందుకున్న ప్రసాద్‌బాబును శుక్రవారం ఎస్‌టియు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను డిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ ఫణిభూషణ్, సీనియర్ నాయకులు శివయ్యఆచారి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.సురేష్‌బాబు, జిల్లా నాయకులు వి.రాజశేఖర్, నాగభూషణ, మురళీకృష్ణ, రామకృష్ణ, యుగంధర్, సుధాకర్, జనార్ధన, మండల నాయకులు ఎం.శ్రీనివాసులు, చంద్రశేఖర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నార్పల : వినాయక చవితి ఉత్సవాల్లో పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. వినాయక ప్రతిమలను రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేయరాదన్నారు. ప్రతిమల వద్ద రాత్రిళ్లు కాపలా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. ఏరోజు నిమజ్జనం చేసేది, ఎక్కడ నిమజ్జనం చేసే తేదీలను ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. విగ్రహాల వద్ద అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

గుత్తి : సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని సచివాలయాల పరిధిల్లో ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు చేపట్టాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణ తోపాటు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, మలేరియా యూనిట్ అధికారి ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్ వన్నూరువలి, తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెద్దవడుగూరు : పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గుత్తి ఎడిఎ వెంకటరాముడు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మా సౌజన్యంతో భూసార పరీక్ష ఫలితాల ద్వారా ఎరువుల యాజమాన్యం, పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ పత్తి పంటలో 16 నుంచి 20 లింగాకర్షక బుట్టలను అమర్చాలని సూచించారు. పంటల బీమా చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు రద్దు చేస్తే ప్రత్యక్ష పోరాటం

ఉరవకొండ : రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్లను వెరిఫికేషన్ పేరుతో దాదాపు 2 లక్షల మంది పింఛన్లు రద్దు చేయడం దుర్మార్గమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల కాలంలోనే 4.15 లక్షల వృద్ధాప్య పెన్షన్లు తొలగించి పేదల కడుపు కొట్టిందన్నారు. మరో 2 లక్షల దివ్యాంగ పెన్షన్లను రద్దు చేసేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. వికలాంగుల సర్టిఫికెట్లలో పర్సెంటేజ్ తగ్గించాలని వైద్యులకు ప్రభుత్వం లక్ష్యం విధించడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఇందుకు నిరసనగా ఇప్పటికే వికలాంగులు రోడ్డెక్కారన్నారు. ప్రభుత్వం స్పందించి పింఛన్లను పునరుద్ధరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాజీ ఎంపిటిసి మృతికి నివాళి

గుత్తి : అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపిటిసి బోయగిరి ప్రసాద్ మృతికి టిడిపి గుత్తి, పామిడి మండలాల ఇంచార్జి గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా ప్రసాద్ ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఇదే గ్రామంలో గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి సీనియర్ నాయకుడు మసిమూతి పెద్ద లాలెప్ప నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం మాజీ సర్పంచి కె.నాగేంద్ర హార్ట్ సర్జరీ చేయించుకుని పట్టణంలోని తన ఇంటి వద్ద ఉండగా అక్కడికి వెళ్లి ఈశ్వర్ పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల కన్వీనర్లు ఎంకె చౌదరి, ఎస్.బర్దివలి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనాయాదవ్, సర్పంచి యు.రామలింగమయ్య, నాయకులు చిన్నరెడ్డియాదవ్, ఎ.గోవర్ధన్‌గౌడ్, చెట్నేపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజించండి

పామిడి : వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పత్రా శ్రీనివాసులు, నగరూరు విశ్వనాథం, నల్లప్ప, జోజోడే కుమార్, శీలం శ్రీనివాసులు, పోలా రంగస్వామి, వడ్ల రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఛార్లెస్ చిరంజీవిరెడ్డి 500 మట్టి విగ్రహాలను ఇచ్చారన్నారు. వాటిని ఈనెల 26వ తేదీ ప్రజలకు ఉచితంగా అందిస్తామన్నారు.

బికె.హలీం మృతికి నివాళి

పామిడి : అనారోగ్యంతో మృతిచెందిన బికె హలీం మృతికి పలువురు శుక్రవారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో వైసిపి ఆర్గనైజేషన్ జిల్లా సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి, పామిడి టౌన్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్టు రామచంద్ర, కత్రిమల సర్పంచు చంద్రశేఖర్‌రెడ్డి, మైనార్టీ టౌన్ కన్వీనర్ ఎర్రగౌస్, మైనార్టీ జిల్లా లీడర్ ఫయాజ్, 16వ వార్డు ఇన్‌ఛార్జి మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై అపోహలొద్దు

ఆత్మకూరు : మండల వ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల పెన్షన్లపై అపోహలు వద్దని మండల కన్వీనర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో అర్హత లేకుండా నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొంది పింఛన్లు తీసుకున్న వారికి మాత్రమే తొలగిస్తారన్నారు. అనర్హుల పింఛన్లను తొలగించేందుకే అధికారులు కసరత్తు చేస్తున్నారన్నారు. అంతేగాకుండా అర్హుల పింఛన్లను తొలగించేది లేదన్నారు. కావున మండలంలో రీ వెరిఫికేషన్ జాబితాలో పేరున్న దివ్యాంగులు ఆందోళన చెందకుండా మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ధ్రువీకరణ పత్రంతోపాటు, ఆధార్ జిరాక్స్, జారీ చేసిన నోటీసు ప్రతులను అందజేసి సదరం క్యాంపులకు హాజరు కావాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బెలుగుప్ప : వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ శివ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గ్రామాల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసుకునేవారు ఆన్‌లైన్‌లోగానీ, ఆఫ్‌లైన్‌లోగానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అయితే వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కార్మికురాలి కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికురాలిగా పని చేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన రామాంజనమ్మ కుటుంబానికి కార్మికులు ఆర్థికసాయం చేశారు. ఈమేరకు ఇంజినీరింగ్ కార్మికులు అందరూ ఒకరోజు వేతనం ఇవ్వగా పోగైన రూ.1,27,000 మొత్తాన్ని నగరపాలక సంస్థ ఎస్ఇతో కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు ఓబుళపతి, ప్రధాన కార్యదర్శి మురళీమోహన్, ట్రెజరర్ పోతులయ్య, స్వతంత్ర యూనియన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, పుల్లయ్య, ఇంజినీరింగ్ కార్మికులు కె.శివన్న, లోకనాథ్‌చౌదరి, గంగిరెడ్డి, రవికుమార్ గౌడ, ఎఐటియుసి నాయకులు రామానాయుడు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గూగూడులో చక్కెర వేలం

నార్పల : మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉదయం 5000 కిలోల చక్కెరను వేలం వేయనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి సాకేతపురం శోభ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు రూ.20వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

మొక్కజొన్న సాగుపై శిక్షణ

యాడికి : మండల పరిధిలోని చందన గ్రామంలో ఆత్మ సౌజన్యంతో శుక్రవారం మొక్కజొన్న సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కీటక సంబంధిత శాస్త్రవేత్త కిషోర్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వీటిలో ముఖ్యంగా, పొలం చుట్టూ కలుపు లేకుండా చూసుకోవడం, పంట మార్పిడి పాటించడం, పురుగు మందులు వాడటం, వేపనూనె వంటి సహజసిద్ధమైన పరిష్కారాలను ఉపయోగిస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ అధికారి జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో డీజేకు అనుమతి లేదు

అనంతపురం : వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే గణేష ప్రతిమల వద్ద ఎలాంటి డీజేలకు అనుమతి లేదని అనంతపురం రూరల్ సీఐ ఎన్.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ ఏర్పాటు చేయాలనుకుంటే తప్పనిసరిగా ఆయా పోలీసుస్టేషన్ల ద్వారా అనుమతి తీసుకోవాలని కోరారు. అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు